సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి మేడపాటి రామలింగేశ్వర భీమారెడ్డి దంపతులు (ఊబలంక) రూ.1,00,001 విరాళం సమర్పించారు.



వెండి మాల సమర్పణ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారికి చలమచర్ల వేణుగోపాలాచార్యులు రూ.1.40 లక్షల విలువైన 54 గ్రాముల వెండి మాలను ఆదివారం సమర్పించారు.

కడలిలోకి 1.30 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 1,30,824 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7 వేల చొప్పున కాలువలకు మొత్తం 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90, భద్రాచలం వద్ద 15.60 అడుగులుగా నీటిమట్టం నమోదైంది.

కిడ్నీ రోగులకు.. కొండంత అండ



రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల

- రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మెరుగైన డయాలసిస్ సదుపాయాలు
- రోజూ 80 మందికి పైగా రోగులకు సేవలు
- ఇది వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వారానికి రూ.5 వేల వరకూ ఖర్చు
- నేడు ప్రభుత్వాసుపత్రిలో పూర్తిగా ఉచితం

సాక్షి, రాజమహేంద్రవరం: కిడ్నీ వ్యాధి బాధితుల ప్రాణ రక్షణకు రక్తం శుద్ధి (డయాలసిస్) చేయడం ఎంతో కీలకమైన విషయం. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి రెండు మూడుసార్లు ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయం. వారానికి కనీసం రూ.5 వేల వరకూ వెచ్చించాల్సి వస్తుంది. పైగా ఇన్నాళ్లూ ప్రైవేటు ఆసుపత్రుల వద్దకు పరుగులు తీయాల్సి వచ్చేది. కుటుంబాన్ని పోషించుకుంటూ అంత మొత్తం ఖర్చు పెట్టాలంటే పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నయా పైసా ఖర్చు లేకుండా డయాలసిస్ చేయించుకునే సౌకర్యాన్ని రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జీజీహెచ్)లో అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిపై బాధితులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డయాలసిస్ అంటే..

మన శరీరంలోని అవయవాల్లో మూత్రపిండాలు (కిడ్నీలు) కూడా ఎంతో కీలకమైనవి. ఇవి చెడు రక్తాన్ని నిరంతరం శుద్ధి చేస్తూ ఉంటాయి. వీటి పనితీరు దెబ్బ తింటే రక్త శుద్ధికి ఆటంకం కలుగుతుంది. అటువంటి వారిలో రక్తాన్ని కృత్రిమంగా శుద్ధి చేయడం అనివార్యం. లేకుంటే వారి ప్రాణానికే ప్రమాదం కలుగుతుంది. ఇలా కిడ్నీ రోగుల్లో కృత్రిమంగా రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియనే డయాలసిస్ అంటారు. మూత్రపిండాల సమస్యలున్న వారు వారి తీవ్రతను బట్టి వారంలో కనీసం రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది.

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో..

కిడ్నీ రోగుల సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. వారి సౌకర్యార్థం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రత్యేకంగా డయాలసిస్ విభాగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో సరైన ఆదరణ లేక.. నిరుపయోగంగా మారిన ఈ కేంద్రాన్ని అధునాతన హంగులతో తీర్చిదిద్దింది. రక్తశుద్ధి ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించింది. పర్యవేక్షణ, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించారు. రోగులకు డీఎంఓ, నెఫ్రాలజిస్ట్ తదితరులు సేవలందిస్తున్నారు. ఇతర సాంకేతిక, హౌస్ కీపింగ్ సిబ్బంది సైతం అందుబాటులో ఉంటున్నారు. ఆసుపత్రిలోని ప్రత్యేక డయాలసిస్ విభాగంలో రక్తం శుద్ధి చేసేందుకు మొత్తం 33 యంత్రాలు ఉండగా.. వీటిలో 27 నెగెటివ్ బ్లడ్, 6 పాజిటివ్ యంత్రాల ద్వారా రోజుకు సుమారు 80 మంది రోగుల రక్తాన్ని శుద్ధి చేస్తున్నారు. దీని కోసం షిఫ్టుల వారీగా వైద్య సిబ్బంది పని చేస్తున్నారు.

అత్యాధునిక వైద్య సేవలు

డయాలసిస్ కేంద్రంలో అత్యాధునిక వైద్య సేవలు, యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో రక్తం శుద్ధి చేయించుకోవాలంటే వారానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అసలే నిరుపేదలు.. ఆపై కుటుంబ పోషణ సమస్య.. దీనికి తోడు డయాలసిస్ చేయించుకోవాలంటే వారిపై ఎనలేని భారం పడేది. ఇటువంటి పేద రోగుల అవస్థలను గుర్తించిన ప్రభుత్వం.. జీజీహెచ్‌లో ఉచితంగా డయాలసిస్ సేవలు పొందే సదుపాయం తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా చర్యలు తీసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. పేద వర్గాలను దృష్టిలో ఉంచుకుని ఈ డయాలసిస్ యూనిట్‌లో అత్యాధునిక సదుపాయాలు సమకూర్చారు. పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో అరకొర సౌకర్యాలతో 10 నుంచి 15 మంది రోగులే సేవలు పొందేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చర్యలతో నేడు నిత్యం దాదాపు 80 మంది వరకూ సేవలు పొందగలుగుతున్నారు.



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని డయాలసిస్ విభాగం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని డయాలసిస్ కేంద్రానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రోగులు వస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం, రాజానగరం, రంగంపేట, గోకవరం, రంపచోడవరం, అమలాపురం నుంచి నిత్యం 80 మంది వరకూ ఇక్కడ డయాలసిస్ సేవలు పొందుతున్నారు. మూడు రోజులకు దాదాపు 250 మందికి పైగా రోగుల రక్తాన్ని శుద్ధి చేసి పంపుతున్నారు.

రూ.10 వేల పింఛనుతో మరింత మేలు

ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కిడ్నీ బాధితులకు పింఛను సదుపాయాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. వారికి ప్రతి నెలా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రైవేటుగా డయాలసిస్ చేయించుకున్నా ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఈ సదుపాయం కల్పించారు. ఈ మొత్తం వారికి ఎంతగానో చేదోడుగా నిలుస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మందికి పైగా రోగులున్నట్టు సమాచారం.

పైసా ఖర్చు లేకుండా..



ఆసుపత్రిలో అత్యాధునిక యంత్రాలతో రోగులకు సేవలు అందిస్తున్నాం. కిడ్నీ ఫెయిల్యూర్ శాతాన్ని నెఫ్రాలజిస్ట్ నిర్ణయిస్తారు. ఒక్కోసారి పాము కాటు, ఇతర సర్జరీల వల్ల కూడా సమస్య రావచ్చు. కాళ్ల వాపు రావడం, రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి తగ్గిపోవడం కిడ్నీ వ్యాధికి సంకేతాలు. వ్యాధి తీవ్రత, స్వభావాన్ని బట్టి నయా పైసా ఖర్చు లేకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం.

– ఆనంద్, డయాలసిస్ సెంటర్ మేనేజర్, జీజీహెచ్, రాజమహేంద్రవరం

సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షల సాయం



సీఎం సహాయ నిధి సాయం లెటర్ ఆఫ్ క్రెడిట్ అందిస్తున్న మంత్రి వనిత

కొవ్వూరు: చాగల్లు మండలం మీనానగరం గ్రామానికి చెందిన కొక్కిరిపాటి రాజేష్ వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన రూ.3 లక్షల సాయాన్ని హోం మంత్రి తానేటి వనిత ఆదివారం అందజేశారు. ఐ.పంగిడి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఆమె.. రాజేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను అందజేశారు. రాజేష్ తుంటి ఎముకలు సరిగా పని చేయకపోవడంతో నడవలేని స్థితిలో ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకు రావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు.

బండారుపై చర్యలు తీసుకోవాలి



డాక్టర్ పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాపై టీడీపీకి చెందిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి చేసిన అనుచిత, అసభ్య వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత మండిపడ్డారు. ఆయనపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆ పార్టీ నాయకులను డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మహిళలను కించపరిచేలా, హేయమైన మాటలు మాట్లాడే వారిపై టీడీపీ అధినేత కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ తమదైన ప్రతిభతో ముందుకు దూసుకుపోతున్నప్పటికీ సమాజంలో వారి పట్ల చులకన భావం ఏమాత్రం తగ్గలేదని డాక్టర్ పద్మలత ఆవేదన వ్యక్తం చేశారు. సమాజాన్ని ప్రభావితం చేసే రాజకీయాల్లో మహిళలను అగౌరవ పరచడం, హేళన చేసే విష సంస్కృతి బాగా పెరిగిపోతోందని అన్నారు. బండారు వంటి వారికి పార్టీలకు అతీతంగా ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. మంత్రి రోజాకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని డాక్టర్ పద్మలత తెలిపారు.

అంతర్జాతీయ టెన్నికాయిట్‌లో బంగారు పతకం



హేమమాధురి

దేవరపల్లి: దక్షిణాఫ్రికాలో ఈ నెల 7న జరిగిన అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో మన రాష్ట్రం నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొనగా.. వీరిలో దేవరపల్లికి చెందిన జి.హేమ మాధురి టీం చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. సింగిల్స్, డబుల్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది. ప్రస్తుతం ఆమె బీటెక్ చదువుతోంది. పదేళ్లుగా టెన్నికాయిట్‌లో శిక్షణ పొందుతున్న ఆమె జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించింది.

న్యూస్‌రీల్

ఫారెస్టు అకాడమీలో ముగిసిన శిక్షణ

రాజానగరం: రాష్ట్రంలో కార్బన్ ఫైనాన్స్ ప్రాజెక్టుల అభివృద్ధికి ఐదు పూల్స్ కార్బన్ స్టాక్ ఆఫ్ ఫారెస్టు అంచనాపై లాలాచెరువులోని ఏపీ ఫారెస్టు అకాడమీలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. అటవీ శాఖ అధికారులు, ఫ్రంట్ లైన్ సిబ్బందికి ఫారెస్ట్ అకాడమీతో కలిసి ది ఎనర్జీ అండ్ రీసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (టీఈఆర్ఐ) ఈ శిక్షణ తరగతులు నిర్వహించింది. కార్యక్రమంలో టీఈఆర్ఐ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ జేవీ శర్మ, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సయ్యద్ ఆరిఫ్ వలీ, అనిరుథ్ పోనీ, కపిల్‌కుమార్, అబ్దుల్ షకీత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జోస్యుల సూర్యప్రకాశరావు కన్నుమూత



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత కాశీ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ జోస్యుల సూర్యప్రకాశరావు (97) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. సంస్కృత భాషలో నారాయణభట్టు రచించిన త్రిస్థలీ సేతు ఆధారంగా డాక్టర్ జోస్యుల.. కాశీ, ప్రయాగ, గయ క్షేత్రాల మహిమను వివరిస్తూ గ్రంథాలు రచించారు. అయోధ్య క్షేత్ర వైభవంపై కూడా ఆయన ఒక గ్రంథం వెలువరించారు. 2021లో శలాక విద్వత్ సమర్చన పురస్కారం అందుకున్నారు. జోస్యుల మృతికి మహామహోపాధ్యాయ శలాక రఘునాథశర్మ, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు, విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమణీ కుమారి, కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి, శ్రీకరి లలితా మండలి వ్యవస్థాపకురాలు గ్రంధి విజయలక్ష్మి తదితరులు సంతాపం తెలిపారు. డాక్టర్ జోస్యులకు ఒక కుమారుడు ఉన్నారు.

525 క్యూసెక్కుల విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి ఆదివారం 525 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పుష్కర–1 నుంచి రెండు మోటార్లు, పుష్కర–2 నుంచి ఒక మోటారు ద్వారా మెట్ట ప్రాంత పంట పొలాలకు నీటిని విడుదల చేశామన్నారు. శనివారం 700 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. సాగునీటికి అంతగా డిమాండ్ లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం రాత్రి 8 గంటల నుంచి ఒక మోటారును నిలిపివేశామని తెలిపారు. డిమాండ్‌ను బట్టి సాగునీరు విడుదల చేస్తామన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం వద్ద గోదావరి నీటిమట్టం 16.9 మీటర్లుగా నమోదైందని వెంకట్రావు తెలిపారు.

కోటసత్తెమ్మ అమ్మవారికి రూ.1.50 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు, తలనీలాలు సమర్పించారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.1,50,750 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు 45 మంది ఎంపిక



రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి ఆర్చరీ (విలువిద్య) పోటీలకు 45 మంది ఎంపికయ్యారని తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలోని ఆర్చరీ శిక్షణ కేంద్రంలో పురుషులు, మహిళలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో ఎంపికైన 45 మంది ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ వైఎస్సార్ కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. పోటీలను అల్లవరపు నగేష్, కొండేపూడి శంకరరావు ప్రారంభించగా వైఎస్సార్‌సీపీ నేతలు కొత్తపల్లి బుజ్జి, పెదపాటి నాగేశ్వరరావు, మఠం లోవరాజు తదితరులు బహుమతులు అందజేశారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. ఉదయం నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు, స్వామివారి ఆలయం కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని సుమారు 20 వేల మంది దర్శించారని అధికారులు తెలిపారు. స్వామివారిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. వెయ్యి వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. దర్బారు మండపం వద్ద స్వామివారి ఉత్సవమూర్తుల దర్శనానంతరం, పులిహోర ప్రసాదానికి భక్తులు క్యూ కట్టారు. క్యూ ఏనుగుల మండపం వరకూ వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల తరువాత భక్తుల రద్దీ తగ్గింది.



సత్యదేవుని గర్భాలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

ప్రతి మాసశివరాత్రికి శంకరునికి విశేష పూజలు

- సహస్ర లింగార్చన, రుద్రాభిషేకం నిర్వహణ
- సత్యదేవుని ఊరేగింపులో అమ్మవారితో పాటు శివలింగం కూడా..
- ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశం



అన్నవరం: రత్నగిరిపై శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఇకపై ప్రతి మాసశివరాత్రికి ఈశ్వరునికి సహస్రలింగార్చన, హోమ మండపంలో రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. రత్నగిరిపై సత్యదేవుని ఆలయంలో స్వామివారికి, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి అనేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే స్వామివారి పక్కన దర్శనమిచ్చే ఈశ్వరునికి మాత్రం ఎటువంటి కార్యక్రమాలూ చేయడం లేదన్నారు. అందువలన ఇకపై ప్రతి మాసశివరాత్రి నాడు ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ వెయ్యి శివలింగాలకు అభిషేకం నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఆయుష్య మండపంలో రుద్రహోమం నిర్వహించాలని పేర్కొన్నారు. మాసశివరాత్రి నాడు సత్యదేవునికి నిర్వహించే లక్ష్మీ ప్రయుక్త ఆయుష్య హోమం స్థానంలో ఈ హోమం నిర్వహించాలని సూచించారు. ఇక నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారితో పాటు పల్లకీలో శంకరుని (శివలింగం) కూడా ఊరేగించాలని ఈఓ తెలిపారు. స్వామివారి ప్రధానాలయంలో సత్యదేవుడు, అమ్మవారు, శంకరుడు భక్తులకు దర్శనమిస్తారని, అటువంటప్పుడు ముగ్గురినీ ఊరేగించాలని అన్నారు. దీనిపై విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీని కలిసి, వారి అనుమతి తీసుకోవాలని ఆదేశించారు.

నేటితో నెల రోజులు

- 30వ రోజుకు చేరిన చంద్రబాబు జైలు జీవితం
- నేడు పలు పిటిషన్లపై తీర్పులు
- సెంట్రల్ జైలు వద్ద భద్రత మరింత కట్టుదిట్టం

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ రిమాండ్ అనుభవిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు జైలు జీవితం సోమవారంతో 30వ రోజుకు చేరనుంది. ఆయనను గత నెల 10న ఇక్కడి జైలుకు తీసుకొచ్చారు. అప్పటి నుంచీ చంద్రబాబు రిమాండ్ ఖైదీగా జైలు జీవితం గడుపుతున్నారు. ఆయనకు జైలు లోపల, బయట ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు యథావిధిగా కొనసాగుతోంది. సుప్రీంకోర్టు, హైకోర్టు, ఏసీబీ కోర్టుల్లో పలు కీలక కేసులపై సోమవారం తీర్పులు రానున్నాయి. మరోవైపు సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్‌పై టీడీపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ జైలు వద్ద భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే 300 మంది ఆక్టోపస్ బృందాలు, పోలీసులతో భద్రత నిర్వహిస్తున్నారు. నేటి ఉత్కంఠ పరిస్థితుల నేపథ్యంలో భద్రత మరింత కట్టుదిట్టం చేసేందుకు పోలీసులు, జైలు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కోర్టు కేసుల విచారణ నేపథ్యంలో సాధ్యాసాధ్యాలపై న్యాయ నిపుణులతో చర్చించేందుకు నారా లోకేష్ హడావుడిగా ఢిల్లీ వెళ్లారు.

అన్నదాతకు తీపి కబురు



- వరి రైతులకు 'మద్దతు'
- సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,183
- గ్రేడ్–ఎ క్వింటాల్‌కు రూ.2,203
- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- జిల్లాలో వరి సాగు విస్తీర్ణం 1,74,123.72 ఎకరాలు
- ఈ–క్రాప్ పూర్తయినది 1,72,849.7 ఎకరాలు

రాజమహేంద్రవరం రూరల్: వరి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలని ఇప్పటికే అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు పండించే పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటించింది. దళారుల ప్రమేయం లేకుండా రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) సీఎం యాప్ ద్వారా పంటలు కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆర్‌బీకేలనే కొనుగోలు కేంద్రాలుగా మార్చుతున్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని నియమించారు. ఈ ఏడాది జిల్లాలో 1,74,123.72 ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఇంతవరకూ 1,72,849.7 ఎకరాల్లో పంటను ఈ–క్రాప్‌లో వ్యవసాయ సిబ్బంది నమోదు చేశారు. ప్రస్తుతం జిల్లాలోని 18 మండలాల్లోనూ వరి సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఖరీఫ్‌లో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. రైతులు తమ అవసరాలకు ఉంచుకోగా, మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

తొలి నుంచీ తోడుగా..

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచే ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల ద్వారా నేరుగా అందజేసింది. నాట్లు వేసినప్పటి నుంచి వెన్ను దశకు వచ్చేంత వరకూ వరి పైరుకు అవసరమైన సాగునీటిని సరఫరా చేసింది. సబ్సిడీపై పురుగు మందుల విక్రయాలు కూడా చేపట్టింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే పెట్టుబడి సాయం అందజేసింది.

దళారుల బారిన పడకుండా..

జిల్లాలో 300 ఆర్‌బీకేలు ఉన్నాయి. వీటిల్లో 231 ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాలు, తూనికలు – కొలతలు, ఇతర శాఖల సమన్వయంతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం తగిన ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. దళారుల మోసాలకు, తూకంలో తేడాలతో రైతులు మోసపోకుండా ప్రతి గ్రామంలోనూ ధాన్యం కొనుగోలును మైత్రీ కమిటీలు పర్యవేక్షించనున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని మిల్లులకు అప్పగించి, మళ్లీ మిల్లర్ల ద్వారా బియ్యం సేకరణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

మద్దతు ధర క్వింటాల్‌కు రూ.143 పెంపు

ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.143 పెంచింది. గత ఏడాది సాధారణ రకం ధాన్యం క్వింటాల్ రూ.2,040కి, గ్రేడ్–ఎ రకం రూ.2060కు కొనుగోలు చేసింది. ఈ ఏడాది మద్దతు ధర పెంచడంతో సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,183కి, గ్రేడ్–ఎ రకానికి క్వింటాల్‌కు రూ.2,203 చొప్పున రైతులకు అందించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు మద్దతు ధర ప్రకటిస్తూ కరపత్రాలు కూడా విడుదల చేసింది. కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ–క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేసుకున్న రైతులు మంచి ధరలకు పంటలు అమ్ముకుని గిట్టుబాటు ధర పొందగలుతారు.

పారదర్శకంగా కొనుగోలు



ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు ఆశాజనకంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 4.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశాల మేరకు రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. రైతులు ఎక్కడా మోసపోకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తాం. ఈ ఏడాది ప్రతి క్వింటాల్‌కు ప్రభుత్వం అదనంగా రూ.143 చొప్పున ప్రకటించింది. రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, తగిన గిట్టుబాటు ధర పొందాలని అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

బుల్లెట్ ఢీకొని ఒకరి దుర్మరణం

కాకినాడ క్రైం: బుల్లెట్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లి నాగేశ్వరరావు (60) వార్ఫ్ రోడ్డులోని ఒక టింబర్ డిపోలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతున్న క్రమంలో జగన్నాథపురం వంతెన వైపు నుంచి బుల్లెట్‌పై వస్తున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో వాహనాన్ని వేగంగా నడుపుతూ నాగేశ్వరరావును ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయాలైన నాగేశ్వరరావును కుటుంబ సభ్యులు జీజీహెచ్‌లో చేర్చగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఆ బండిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

పాముకాటుతో..

ముమ్మిడివరం: వరిచేలో పురుగు మందు పిచికారీ చేస్తుండగా పాముకాటు వేయడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం గోదాశివారిపాలేనికి చెందిన బొబ్బిలి వీరభద్రం (59) శనివారం ఒక రైతు పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్నాడు. ఆ సమయంలో అతడిని పాము కరిచింది. వెంటనే అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వీరభద్రం వ్యవసాయ కూలీగా జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి భార్య సత్యవతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్‌హెచ్‌ఓ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో..

కడియం: కడియపులంక గ్రామానికి చెందిన కె.చిన వెంకన్న ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తన ఇంటి నిర్మాణ పనులు చేస్తూ దురదృష్టవశాత్తూ విద్యుత్ తీగను తాకాడు. ఈ తీగకు అతుకులు ఉండడంతో విద్యుత్‌ఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుని ఆలయానికి కార్తిక శోభ

- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్న దేవస్థానం
- రద్దీకి అనుగుణంగా ప్రణాళిక
- వివరాలు వెల్లడించిన చైర్మన్ రోహిత్, ఈవో ఆజాద్



అన్నవరం సత్యదేవుని ఆలయం



కార్తిక మాసంలో రూ.300 వ్రతాలు నిర్వహించే సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక

అన్నవరం: కార్తికమాసంలో రత్నగిరి సత్యదేవుని సన్నిధికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకూ కొనసాగనున్న కార్తికమాసంలో సత్యదేవుని దర్శనానికి సుమారు 15 లక్షలు మంది భక్తులు విచ్చేస్తారని, సుమారు 1.50 లక్షలు వ్రతాలు నిర్వహిస్తారని అంచనా. ఆ ఒక్క నెలలోనే స్వామివారికి రూ.15 కోట్లు పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం చైర్మన్, ఈఓ తదితరులు దేవస్థానంలోని వ్రతమండపాలు, 30 వీఐపీ సత్రం స్థలం, అన్నదానం భవనం, ఆలయ క్యూలైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్తికమాసంలో చేస్తున్న ఏర్పాట్లను వివరించారు.

- రూ.300 వ్రతాలను ఎనిమిది వ్రత మండపాలతో పాటు స్వామివారి నిత్య కల్యాణ మండపం, వార్షిక కల్యాణ మండపం ముందుగల విశ్రాంతి షెడ్డులోనూ నిర్వహిస్తారు.
- వార్షిక కల్యాణ మండపం ముందు గల విశ్రాంతి షెడ్డులో అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం ఎనిమిది వరకూ, భక్తుల రద్దీ అధికంగా ఉంటే పది గంటల వరకూ జరుగుతాయి.
- ఏటా కార్తిక మాసంలో భక్తులకు ఉదయం ఎనిమిది నుంచి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పులిహోర, దద్దోజనం, కదంబం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈసారి వీటిని సర్క్యులర్ మండపం వద్ద కాకుండా అన్నదాన భవనం వద్దనే పంపిణీ చేస్తారు.
- భక్తులు ఈ ప్రసాదాలను స్వీకరించిన తరువాత అక్కడి నుంచి తమ వాహనాల వద్దకు వెళ్లి, పాత సీఆర్వో వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్డు మూడో మలుపు వరకూ నిర్మించిన రోడ్డు ద్వారా దిగువకు వెళ్లిపోవాలి.
- భక్తుల వాహనాలను ప్రకాష్ సదన్ సత్రం వెనుక స్థలం, మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలం, హరిహర సదన్, శివ సదన్, సత్యగిరిపై ఇతర ఖాళీ ప్రదేశాలలో నిలుపుదల చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వీటిని దాటి ముందుకు వచ్చే అవకాశం ఉండదు.
- వీఐపీల వాహనాలను మాత్రమే సర్క్యులర్ మండపం దిగువన గల ఖాళీ ప్రదేశంలోకి అనుమతిస్తారు.
- ఈ నెల 15 నుంచి అమలు చేయనున్న రూ.300 టికెట్‌తో సత్యదేవుని ప్రదక్షిణ దర్శనం చేసుకునే భక్తులకు సత్యదేవుని గోధుమనూక ప్రసాదం ప్యాకెట్ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. ఈ ప్యాకెట్లను ఎక్కడ పంపిణీ చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నారు. టికెట్‌తో పాటు ఇవ్వాలా లేక దర్శనం అనంతరం ఇవ్వాలా అనేది త్వరలో నిర్ణయిస్తారు.

అనివేటి మండపం విభజన

రూ.1500 వ్రతాలాచరించే అనివేటి మండపంలో గతంలో రెండు బ్యాచులుగా వ్రతాలు నిర్వహించేవారు. రెండు బ్యాచ్‌లు దగ్గరగా ఉండడం వలన భక్తులకు ఇబ్బందిగా ఉండేది. విషయం గమనించిన ఈఓ చంద్రశేఖర్ అజాద్, మండపాన్ని తాత్కాలికంగా రెండుగా విభజిస్తూ మధ్యలో అద్దాలతో పార్టిషన్ చేశారు. దీని వలన ఒక మండపంలో జరిగే వ్రతం తాలూకు మంత్రాలు, వ్రతకథ రెండో మండపంలో ఉన్నవారికి వినిపించవు.

- కేశఖండనశాల ఎదురుగా గల టికెట్ కౌంటర్ వద్ద పురుషులకు, స్త్రీలకు విడివిడిగా 20 చొప్పున టాయిలెట్లు నిర్మించనున్నారు.
- 30 వీఐపీ సత్రం కూల్చేసిన స్థలంలో రూ.1.99 కోట్లతో 150 అడుగుల వెడల్పు, 180 అడుగుల పొడవున షెడ్డు నిర్మించేందుకు లారెల్స్ ల్యాబ్ ప్రతినిధులు ముందుకు వచ్చిన విషయం విదితమే. అయితే ఈ సత్రం వ్యర్థాలు తొలగించేందుకు ఇంకా సమయం పట్టనుంది. వాటిని తొలగించాక దాని ముందు రోడ్డు లెవెల్‌కు చదును చేయాలి. ఈ పనులు పూర్తయ్యేందుకు నెలాఖరు వరకూ సమయం పట్టే అవకాశం ఉంది. అందువలన కార్తికమాసం సందర్భంగా తాత్కాలికంగా 150 అడుగుల వెడల్పు, 180 అడుగుల పొడవున షెడ్డు నిర్మించి భక్తులకు వసతి కల్పించాలని భావిస్తున్నారు.
- తూర్పు రాజగోపురానికి ఇరువైపులా విశ్రాంతి షెడ్ల నిర్మాణ పనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయి. వీటిలో గోపురానికి కుడి వైపు పక్కన వేస్తున్న షెడ్డులో భక్తుల క్యూలైన్ వస్తుంది. ఇక్కడ భక్తులకు తాగునీరు, ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు.
- ఎడమవైపు వేస్తున్న షెడ్డులో రూ.1500 టికెట్ వ్రతాలు ఆచరించే భక్తులు వేచియుండేందుకు తగిన ఏర్పాట్లు చేస్తారు. ఫ్యాన్లు, తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేస్తారు.
- రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరి మధ్య రాకపోకలు సాగించేందుకు ప్రస్తుతం ఉన్న బస్సులకు తోడు మరో ఐదు బస్సులు నడుపుతారు.
- కార్తికమాసంలో శని, ఆది, సోమవారాలు, సప్తమి, దశమి, ఏకాదశి, క్షీరాబ్ధి ద్వాదశి, పౌర్ణమి తదితర పర్వదినాలలో సుమారు 50 వేల మంది నుంచి లక్ష మంది వరకూ భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఆ రోజుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.
- నవంబర్ 27, పౌర్ణమి, సోమవారం పర్వదినం సందర్భంగా సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఆ రోజు స్వామివారి గిరిప్రదక్షణలో లక్ష మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. ఆరోజు సాయంత్రం పంపా తీరంలో నదీ హారతి, అదే రోజు రాత్రి ఏడు గంటలకు తొలి పావంచా వద్ద జ్వాలా తోరణం నిర్వహిస్తారు. దీనికోసం విస్తృత ఏర్పాట్లు చేస్తారు.
- దసరా అనంతరం కార్తికమాసం ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, వీటిపై వారి అభిప్రాయాన్ని కూడా కోరనున్నట్లు చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు.

విరాళాల కౌంటర్ ప్రారంభం

గోకులానికి ఎదురుగా గల కంకణాలు, శాలువాలు, కండువాలు విక్రయించే కౌంటర్ వద్ద అన్నదానం, గోసేవ, తదితర విరాళాలు సేకరించేందుకు కౌంటర్‌ను శనివారం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ప్రారంభించారు. తొలి విరాళాన్ని ధర్మకర్తల మండలి సభ్యుడు పేరూరి బద్రీనారాయణ, ప్రముఖ వ్యాపారి వీర్ల సూరిబాబు అందజేశారు.

పీఠంలో 15 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు

- తొమ్మిది రోజులూ ప్రత్యేక పూజలు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన గాడ్



శరన్నవరాత్ర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి గాడ్ తదితరులు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో 52వ దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాద్రేవు వేణుగోపాల్ (బాబీ) తెలిపారు. గాడ్ సమక్షంలో ఆదివారం వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 15వ తేదీ ఉదయం 8:30 గంటలకు అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశ స్థాపనతో ఉత్సవాలు మొదలవుతాయన్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా ప్రతి రోజూ అమ్మవారు ఒక్కో రూపంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. 15న అమ్మవారు రజత కవచ అలంకరణ అవతారంలోనూ, 16న బాలా త్రిపుర సుందరీదేవిగా, 17న గాయత్రీదేవిగా, 18న అన్నపూర్ణాదేవిగా, 19న మహాలక్ష్మీదేవిగా, 20న సరస్వతీదేవిగా, 21న లలితా త్రిపుర సుందరిగా, 22న దుర్గాదేవిగా, 23న ఉదయం మహిషాసుర మర్దినిగా, సాయంత్రం రాజరాజేశ్వరిదేవిగా పూజలందుకుంటారన్నారు. ప్రతి రోజూ ఉదయం పీఠంలో శ్రీచక్ర అర్చనలు, దేవీ యాగం, నవావరణ అర్చన. సప్తశతీ పారాయణ, సాయంత్రం 4 గంటల నుంచి వేద పారాయణ, దేవీభాగవత ప్రవచనాలు, లలితా, విష్ణు సహస్రనామ సామూహిక పారాయణలు, నక్షత్ర హారతి తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కర నారాయణ, సత్య వెంకట కామేశ్వరి, పెద్దపాటి సత్య కనకదుర్గ, బి.రమ పాల్గొన్నారు.

10 నుంచి ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా స్థాయి ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడాంశాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో జిల్లా స్థాయి బాలురు, బాలికల జట్ల ఎంపికలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. 10న అండర్ 14, 17 అథ్లెటిక్స్ బాలికలు, 11న అథ్లెటిక్స్ బాలురు, 12న ఫుట్‌బాల్ అండర్ 14 బాలురు, బాలికలు, కబడ్డీ అండర్ 14, 17 బాలురు, 13న అండర్ 14, 17 బాలికల కబడ్డీ, టెన్నికాయిట్ బాలురు, బాలికలు, సపక్ తక్రా బాలురు, బాలికల ఎంపికలు జరుగుతాయి. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ స్కూల్లో సాఫ్ట్ టెన్నిస్ అండర్ 14, 17 బాల బాలికలు ఎంపికలు నిర్వహిస్తారు. జూడో ఎంపికలు వాయిదా పడ్డాయని, తదుపరి తేదీలు త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ ఎంపికలకు విద్యార్థులను తీసుకువచ్చే వ్యాయామ ఉపాధ్యాయులు మిడ్డేమీల్ ఎక్విడెన్స్‌ను తప్పని సరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 94908 96851 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి



సత్యనాగసాయి (ఫైల్)

సీతానగరం: చినకొండేపూడి పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.నాగసత్యసాయి(58) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాకినాడ జిల్లా ప్రతిపాడుకు చెందిన ఈయన సీతానగరంలో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి సీతానగరానికి మోటారు సైకిల్‌పై వస్తుండగా మునికూడలి వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికుల సమాచారంతో 108లో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం వేరే ఆసుపత్రికి మార్చారు. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందారు. సాయికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన గతంలో చినకొండేపూడి, రఘుదేవపురం, పురుషోత్తపట్నం పంచాయతీల్లో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు.

కొబ్బరికాయల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

- 40 వేల కురిడీ కాయలు దగ్ధం
- సుమారు రూ.3.50 లక్షల ఆస్తినష్టం



మంటలను ఆర్పుతున్న యానాం అగ్నిమాపక సిబ్బంది

యానాం: యానాం – నీలపల్లి సరిహద్దు ప్రాంతంలో ఆదివారం రాత్రి కొబ్బరి కాయలు నిల్వ ఉంచిన గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.3.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. కురసాంపేట చేర్చియున్న చెరువు ఎదురుగా తోటలో సలాది గోవిందు అనే కొబ్బరి కాయల వ్యాపారికి చెందిన పెంకుల గోడౌన్‌లో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అందులో ఉన్న నిల్వ ఉంచిన 40 వేల కురిడీ కొబ్బరికాయలు కాలిపోయాయి. అలాగే అందులోని రెండు పెద్ద పాత ఫ్రిజ్‌లు సైతం దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న యానాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఒక ఫైర్ ఇంజిన్‌లోని సరిపోక పోవడంతో రెండో ఫైర్ ఇంజిన్‌ను సైతం తీసుకువచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్న లీడింగ్ ఫైర్‌మెన్లు జానకిరామయ్య, మీరా సాహెబ్ తెలిపారు.

10న రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న రెజ్లింగ్ క్రీడాకారుల జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు డాక్టర్ జి.ఎలీషాబాబు ఆదివారం తెలిపారు. సీనియర్స్ పురుషులు, మహిళల విభాగంలో జరిగే ఈ ఎంపికలను స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు కాకినాడ జరిగే రాష్ట్రస్థాయి, గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆసక్తి కలవారు రెజ్లింగ్ సంఘ కార్యదర్శి మూర్తిని 95050 51197 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న ఇంటర్ ఆర్‌జేడీ శారద

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థలలో 2023 మార్చి/మేలో ఇంటర్ పాసైన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఐ.శారద హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు డీజీ లాకర్ యాప్‌పై అవగాహన కల్పించారు. అకాడమిక్ డైరెక్టర్ సతీష్ బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు. తిరుమల విద్యాసంస్థలలో 2023 మార్చి/మేలో పాసైన విద్యార్థులందరూ కళాశాలలో సోమవారం ఉదయం నుంచి సర్టిఫికెట్లు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీహరి తెలిపారు.

ముమ్మిడివరంలో వైనాట్ బ్రాంచ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సుధీర్ తదితరులు

ముమ్మిడివరం: ఎలక్ట్రానిక్ రంగంలో ఉభయ గోదావరి జిల్లాల్లో పేరుగాంచిన వైనాట్ తన 29వ బ్రాంచ్‌ను ఆదివారం ముమ్మిడివరంలో ప్రారంభించింది. షోరూమ్‌ను హైయర్ వైజాగ్ బ్రాంచ్ హెడ్ వీఎస్ సుధీర్, సేల్స్‌ను లాయిడ్ జీజీఎం బ్రాంచ్ హెడ్ ఎండీ అబ్దుల్ రహీమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైనాట్ సంస్థల అధినేత జజ్జరపు రాయుడు మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరాభిమానాలతో తమ సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఎల్‌జీ బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, సామ్‌సంగ్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పాల్గొన్నారు.

జీడీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 5 నుంచి దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు ఆల్ ఇండియా జీడీఎస్ యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. రాజమహేంద్రవరం డివిజన్ గ్రామీణ డాక్ సేవక్ ద్వైవార్షిక సమావేశం ఆదివారం స్థానిక టి.నగర్‌లోని పాలు, పెరుగు వర్తక సంఘం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీడీఎస్‌లకు 8 గంటల పని, పింఛన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి, ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడిగా బీవీ రమణ, డివిజన్ కార్యదర్శిగా పి.భూలోకం, కోశాధికారిగా పి.శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంతరిక్ష విజ్ఞానాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



జేసీ తేజ్ భరత్, ఎస్పీ జగదీష్, షార్ డీడీ సునీల్‌తో ఆర్గనైజింగ్ కమిటీ, ఇస్రో శాస్త్రవేత్తలు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

- జేసీ తేజ్ భరత్
- ముగిసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇస్రోలో ఉద్యోగాల్లో చేరడానికి అనువుగా కెరీర్ గైడెన్స్ రూపొందించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు సభకు గౌరవ అతిథిగా విచ్చేసిన జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ప్రజలు సౌకర్యవంతమైన జీవనం సాగిస్తున్నారంటే అందుకు ఇస్రో పరిశోధనలు, ప్రయోగాలే కారణమన్నారు.

ఇస్రో అద్భుత విజయాలు: ఎస్పీ జగదీష్

చంద్రయాన్, ఆదిత్య ఎల్1 వంటి ప్రయోగాలతో ఇస్రో అద్భుత విజయాలను నమోదు చేసిందని ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలకు విద్యార్థులను ఆహ్వానించి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. వేల మంది ఇక్కడకు వచ్చి తిలకించిన నేపథ్యంలో ఇందులో ఒక శాతమైనా ఇస్రో శాస్త్రవేత్తలుగా వెళ్లాలని ఆకాంక్షించారు.

భవిష్యత్ తరాలకు విజ్ఞానం: డీడీ సునీల్

గడచిన 60 ఏళ్లలో ఎన్నో ప్రయోగాలు చేసి విజయాలను నమోదు చేసున్న ఇస్రో.. భవిష్యత్తులో హ్యూమన్ మిషన్, గగన్‌యాన్, చంద్రయాన్ 4, 5, 6 ప్రయోగించాల్సి ఉందని, అందుకే భవిష్యత్ తరాలకు అంతరిక్ష విజ్ఞానాన్ని చేరువ చేస్తున్నామని శ్రీహరికోట షార్ డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ చెప్పారు. అక్టోబర్ 4 నుంచి 10 వరకూ ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఏటా ఒక అంశంతో నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ ఏడాది స్పేస్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్ పేరిట నిర్వహించామన్నారు. కళాశాలల ఎడ్యుకేషన్ ఆర్జేడీ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ ఇస్రో సాధిస్తున్న విజయాలను వివరిస్తూ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు నమోదు చేసుకోవాలన్నారు. శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్, ఉత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఎస్.విజయ కుమార్ మాట్లాడుతూ ఈ మూడు రోజుల్లో దాదాపు 25 వేల మందికి పైగా విద్యార్థులు సందర్శించారన్నారు. అనంతరం అతిథులను, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను సత్కరించారు. రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా ప్రజల మధ్య రాజమహేంద్రవరంలో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. డిప్యూటీ డీఈవో నారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత బాలాత్రిపుర సుందరి, అక్షరశ్రీ స్కూల్ డైరెక్టర్ టి.నాగరత్నం, ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నాయకులు పురెడ్ల కల్యాణ్ రెడ్డి, రవిచంద్ర, ఎ.రమేష్, పి.సురేష్, పి.శివాజీ, ప్రగతి మురళి, జస్వర్ స్కూల్ రమేష్, పి.గంగాధరరావు, డీవీ స్వామిరెడ్డి, ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు మండెల శ్రీరామ్మూర్తి, అధ్యక్షుడు కె.పార్థసారథి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితర ప్రముఖులు, వేల మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. అక్షర శ్రీ , ట్రిప్స్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాకినాడ జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. జిల్లా క్రీడామైదానంలో ఆదివారం జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారుల ఎంపికలు, పోటీలు జరిగాయి. ద్వారంపూడి వీరభద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వీటిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తైక్వాండో, కరాటే, కుంగ్‌ఫూ వంటి క్రీడలు ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరికీ అవసరం అన్నారు. పోటీలలో క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని, ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఒలింపిక్ సంఘం చైర్మన్ చుండ్రు గోవిందరాజు మాట్లాడుతూ ఈ ఎంపికలకు 400 మంది రావడం జిల్లాలో తైక్వాండో క్రీడకు ఉన్న ఆదరణ అర్థమవుతోందన్నారు. తైక్వాండో సంఘ అధ్యక్షుడు మధుసూదనరావు మాట్లాడుతూ తైక్వాండో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు అనేక మంది ఉన్నారన్నారు. సంఘ కార్యదర్శి బి.అర్జునరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్స్ విభాగంలో బాలురు, బాలికల జట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయి ఎంపికలు ఈ నెలాఖరున కడపలో జరుగుతాయన్నారు. అనంతరం అతిథులను తైక్వాండో సంఘం తరఫున సత్కరించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, పీఈటీ సంఘ కార్యదర్శి నూకరాజు, విశ్రాంత పీఆర్ డిగ్రీ కాలేజీ పీడీ కృష్ణమూర్తి, తైక్వాండో రిఫరీలు పాల్గొన్నారు.